

తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు


తెలంగాణ

# జీవగడ్డ

ఎడిటర్:
మోటపలుకుల వెంకట్ డిజిటల్ పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ జీవగడ్డ పేపర్, చానల్‌లో పనిచేయుటకు జిల్లా స్టాఫర్స్, ఆర్సీలు, మండల రిపోర్టర్స్ కావలెను. ఆసక్తి గలవారు వెంటనే కాల్ చేయండి 79936 13224



ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , గురువారం 05-03-2026 సంపుటి :02 సంచిక : 149 పేజీలు :04 వెల : 3.00


### కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో

## భేటీ కానున్న సీఎం రేవంత్



న్యూఢిల్లీ, మార్చి 04: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. అందుకోసం అమిత్ షా నివాసానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు. అదీకాక ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది.ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే మీడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజయ్ కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించనున్నారని చర్చ నడుస్తోంది.



## రాహుల్ గాంధీకి మందకృష్ణ లేఖ

వరంగల్, మార్చి 4: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## భూములు కోల్పోయే రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం



హైదరాబాద్, మార్చి 4: ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక పరిహార చెల్లింపుకు సిద్ధంగా ఉన్నామని.. భూములు కోల్పోయే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయంగా తామే రైతుల వద్దకు వెళ్లి భూసేకరణ ప్రక్రియ చేపడతామని మంత్రులు వెల్లడించారు. గత ప్రభుత్వం భూసేకరణ, పరిహారంపై మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని, వారికి అమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరిస్తామని చెప్పారు.రామప్ప - లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై 15 రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రులు పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

# చెప్పకనే చెబుతున్నా




ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతం చేశామని ఇటు అమెరికా అటు ఇజ్రాయెల్ ఏకకంఠంతో ధృవీకరించినా, భారత ప్రధాని నరేంద్రమోదీ నోరువిప్పకపోవడం సముచితం కాదని కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మౌనం తటస్థం కాదు, తప్పించుకోవడం అంటున్నారామె. భారత విదేశాంగ విధానం లక్ష్యాలు, ఆశయాల మీద అనుమానాలు కలుగుతున్నాయని, దాని విశ్వసనీయత దెబ్బతింటున్నదని హెచ్చరించారు ఆమె. ఖమేనీ హత్యను ప్రశ్నించకుండా, ఇరాన్ సార్వభౌమత్వ ఉల్లంఘనను ఖండించకుండా మోదీ ప్రభుత్వం మౌనం పాటించడం అసలు సంఘటనల కంటే ఎక్కువ దిగ్భ్రాంతికి గురిచేస్తోందట. పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఆయన చేత ఏదో మాట్లాడించాలని ఆమె ఎందుకు అనుకుంటున్నారో తెలియదు కానీ, నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ యుద్ధం విషయంలో అనుసరిస్తున్న విధానం మీద ఎవరికీ ఏ అనుమానాలూ లేవు. ఆయన ఇజ్రాయెల్‌లో ఒకే ఒక్కరోజు కాలూనివచ్చిన కొద్దిగంటల్లోనే ఆరంభమైన ఈ భీకర యుద్ధం గురించి నోరుతెరిచినదానికంటే ఎక్కువగా మౌనంగానే చెప్పేశారు. ఇరాన్ మీద ఇజ్రాయెల్ దాడిచేయగానే తాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూతో మాట్లాడినట్టు ఓ పోస్టుపెట్టారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగానూ, గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాల మీదా ఇరాన్ ప్రతీకారదాడులు చేయగానే తాను అరబ్ ఎమిరేట్స్ అధినేతతో ఫోన్‌లో మాట్లాడానని మరో ట్వీట్ చేశారు. ఎమిరేట్స్ అధినేతను బ్రదర్ అని సంబోధిస్తూ, ఆ దేశం మీద జరిగిన దాడులను మోదీ తీవ్రంగా ఖండించారు. రెండు ఫోన్‌కాల్స్, ఇటీవలి రెండు సమావేశాలు మన విధానాన్ని విస్పష్టంగా ప్రకటిస్తున్నాయని మీడియా విశ్లేషిస్తూంటే, ఇంకా మోదీ నోరువిప్పాలని డిమాండ్ చేయడం అనవసరం.యుద్ధం ఇప్పట్లో ఆగదు, ఈ క్షిపణిమోతల తరువాత, బూట్ల చప్పుళ్ళు కూడా వినబడతాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ అధినాయకుడు నెతన్యాహూ ముక్తకంఠంతో తేల్చేశారు. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను భూగర్భం నుంచి వెలికితీసినప్పుడూ, ఉరితీసినప్పుడూ ఎంతటి అవమానకరమైన, వికారమైన భాష విన్నామో ఇప్పుడూ అదే వినబడుతోంది. ఎనభైనాలుగేళ్ళ వృద్ధుడు, రేపోమాపో దిగిపోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఈ హత్య జరిగింది. గతంలో ఇరాన్ ఉన్నతాధికారులను, నేతలను అమెరికా హత్యచేసిన తీరుకూ, ఈ సామూహిక హత్యాకాండకూ ఉన్న తేడా అనేకులకు గుర్తుకువస్తున్నది. వేగంగా ప్రయాణిస్తున్న కారులో సైతం తాము లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తిని మాత్రమే హత్యచేయగలిగే నైపుణ్యం, సమర్థత, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉండి కూడా, ఈ వృద్ధుడిని సకుటుంబసపరివారంగా హతం చేయడం ద్వారా అమెరికా మిగతా ప్రపంచాన్ని భయపెట్టి, వికటాట్టహాసం చేసింది. రాత్రికి రాత్రి దేశాధినేతలను ఎత్తుకుపోవడమే కాదు, ఎక్కడ దాక్కున్నా అతిభయానకంగా మట్టుబెట్టగల శక్తిసామర్థ్యాలు తమకు ఉన్నాయని ట్రంప్ చాటిచెప్పారు. గిట్టని పాలకుడిని మట్టుబెట్టిన తరువాత కూడా ఇంకా ఈ విధ్వంసం ఎందుకు అని కొందరి అనుమానం. ఖమేనీ స్థానంలోకి ఎందరు వచ్చినా వారూ హతం కావాల్సిందే కానీ, తమ కీలుబొమ్మ కుర్చీ ఎక్కేవరకూ ఈ యుద్ధమూ విధ్వంసమూ ఆగదని దానర్థం. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకొనేందుకు అనాదిగా ఉపయోగిస్తున్న భవనాన్ని అమెరికా యుద్ధవిమానాలు నేలమట్టం చేయడంలో మీ పాలకులు ఎవరో నిర్ణయించేది మేమేనన్న హెచ్చరిక ఉంది. తమ మతపెద్దను అమెరికా హత్యచేయడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియాలకు ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగించడం సహజం. చాలాచోట్ల నిరసనల్లో సున్నీలు కూడా పాల్గొన్నారని, మొత్తంగా ముస్లిం సమాజం మనసుగాయపడిందనే విశ్లేషణలు వింటున్నాం. ఆగ్రహావేశాలు వేగంగానే ఉపశమించవచ్చును కానీ, గాయం మానడం కష్టం. దీని ప్రభావం ఎన్నిరూపాల్లో ఎన్నివిధాలుగా ఉంటుందో భవిష్యత్తు చెబుతుంది. యుద్ధం కూడా నాలుగువారాల్లో ముగుస్తుందని ట్రంప్ అంటున్నా, ఒకవేళ నిజంగానే అది జరిగినా, రేపిన నిప్పు మాత్రం చల్లారదు. సద్దాం మరణానంతర ఇరాక్ కొత్తరకం ఉగ్రవాదశక్తులను ఎగుమతిచేసిన దుష్ప్రభావాలు ప్రపంచం ఇప్పటికీ చవిచూస్తోంది. గతకాలపు కత్తియుద్ధాల్లో శత్రువు తలతెగితే విజయం సాధించినట్టే. ఇప్పుడూ అదే జరిగినా యుద్ధం సాగుతోంది. రాజు మరణించగానే శత్రుసైన్యాలు దాసోహపడటం, రాజ్యమూ అంతఃపురం సహా సమస్త పరివారం వశం కావడం రాచరికాల్లోనే సాధ్యం.



## ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్

# ఓపెనింగ్ చేయించాలి

స్పోర్ట్స్ డెస్క్: టీ20 ప్రపంచ కప్ 2026)లో భాగంగా రేపు(గురువారం) ముంబై వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య హై హోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఇదే సమయంలో టీమిండియా టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచుల్లో కేవలం 80 పరుగులు మాత్రమే చేశాడు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే అతడు బ్యాట్‌తో అర్ధ సెంచరీతో రాణించాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచనలు చేశాడు. ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించాలని, తుదిజట్టులో రింకు సింగ్‌ను తీసుకోవాలని అన్నాడు.ఐసీసీ రివ్యూలో రవిశాస్త్రిమాట్లాడుతూ... గురువారం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మను కొనసాగించాలని, మానసికంగా ఇబ్బందిపడుతుండటం వల్లే అతడు పెద్దగా స్కోర్లు చేయలేకపోతున్నాడని అన్నాడు. గతంలో అభిషేక్ ఇంగ్లండ్ సిరీస్‌లో అద్భుతంగా రాణించన సంగతి మనందరం గుర్తు చేసుకోవాలని తెలిపాడు. అతడు సెమీ ఫైనల్‌లో రాణిస్తాడనే నమ్మకం తనకు ఉందని రవిశాస్త్రి వెల్లడించాడు. అలానే ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించాలని, అలాగే తుది జట్టులోకి రింకు సింగ్‌ను తీసుకుని లోయర్ ఆర్డర్‌లో అతడికి అవకాశం ఇవ్వాలని రవిశాస్త్రి సూచించాడు. ఇషాన్ కిషన్, సంజు శాంసన్ కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించాలని ఆయన తెలిపాడు.గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన 5 టీ20 మ్యాచ్‌లో సిరీస్‌లో అభిషేక్ శర్మ భారీ సెంచరీ (135) బాదాడు. అలాగే టీ20ల్లో భారత క్రికెటర్లలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీ ప్రారంభానికి ముందు సూపర్ ఫామ్‌లో ఉన్న ఈ యువ హిట్టర్.. అనూహ్యంగా ఈ ఐసీసీ టోర్నీలో విఫలమవుతూ వస్తున్నాడు. ఇదే సమయంలో మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ ఏడు మ్యాచులు ఆడి.. 224 పరుగులు చేశాడు. సూపర్-8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సంజు శాంసన్ 97 పరుగులతో అజేయంగా నిలిచాడు.








తెలంగాణ
జీవగడ్డ
ఎడిటర్:
మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక
జనరల్ న్యూస్
గురువారం
05.03.2026


## విరోష్ రిసెప్షన్ ఏం ఉన్నారబ్బా

# ఫిదా అంతే



విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఇండస్ట్రీ మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరు ఆయన గురించే మాట్లాడుకొంటున్నారు అంటే అతిశయోక్తి కాదు. సాధారణంగా ప్రతి సెలబ్రిటీ పెళ్ళిలో వధువు హైలైట్ అవుతుంది. కానీ విజయ్- రశ్మిక పెళ్ళిలో వరుడు మాత్రమే హైలైట్ గా నిలిచారు. అందుకు కారణం ఆయన ధరించిన దుస్తులే. అసలు పెళ్ళికొడుకు ఆభరణాలు ధరిస్తాడా.. ? అని అనుకొనేవారందరికీ విజయ్ పెళ్ళి లుక్ ఒక షాక్. రాజుల కాలంలో రాజులు ఇలానే ఉండేవారా అని అనిపించేలా చేశారు. పెళ్ళి కదా కేవలం అక్కడే ఇలాంటి లుక్ తో కనిపిస్తారు. మిగతా ఈవెంట్స్ లో నార్మల్ గా కనిపిస్తారు అనుకున్నారు. కానీ, ప్రతి ఈవెంట్ లో విరోష్ ఎంతో ప్రత్యేకంగా కనిపించి అందరిని ఆశ్చర్యపరుస్తూనే వస్తున్నారు.ముఖ్యంగా




విజయ్ లుక్.. పెళ్ళి దగ్గర నుంచి ఊరికి వెళ్లడం, సత్యనారాయణ వ్రతం, ఫ్యాన్స్ మీట్, ప్రెస్ మీట్, రిసెప్షన్.. ఇలా ప్రతిదాంట్లో కూడా ఎక్కడా సాంప్రదాయాన్ని వదలకుండా తెలుగుదనం ఉట్టిపడేలా కనిపించారు. రశ్మిక సైతం.. పెద్ద పెద్ద డిజైనర్ చీరలు, ఫ్యాషన్ ఫాలో అవ్వకుండా చాలా సింపుల్ గా ఒక తెలుగింటి కోడలు ఎలా అయితే కనిపిస్తుందో అలాగే కనిపించి అందరి ప్రశంసలను అందుకున్నారు.ఇక రిసెప్షన్ కి కూడా విరోష్ సాంప్రదాయాన్ని వదలలేదు. రెడ్ కలర్ సబ్యసాచి చీరలో రశ్మిక కనిపించగా.. వైట్ అండ్ వైట్ పట్టు పంచెతో విజయ్ ఎంతో హుందాగా కనిపించారు. నిజంగా వీరిద్దరి లుక్ మాత్రం చాలామంది మరిచిపోయిన తెలుగు సాంప్రదాయాలను గుర్తుచేస్తోంది అని చెప్పొచ్చు. విరోష్ జంటను చూసి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. అంత అందంగా కనిపించారు. ప్రస్తుతం విరోష్ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.




## జోరుమీదున్న చెన్నై చంద్రం

గత రెండు దశాబ్దాలకు పైగా చిత్రపరిశ్రమలో హీరోయిన్‌గా రాణిస్తూ, చెన్నై చంద్రంగా గుర్తింపు పొందిన త్రిష వరుస చిత్రాల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె నటించిన చిత్రాలు వరుసగా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. మణిరత్నం 'థగ్ లైఫ్' తర్వాత తాజాగా సూర్య సరసన 'కరుప్పు'లో త్రిష నటించారు. ఈ చిత్రానికి ఆర్‌జే బాలాజీ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందింది. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదలకానుంది.అలాగే, తెలుగులో చిరంజీవి సరసన 'విశ్వంభర', మలయాళంలో మోహన్‌లాల్‌తో కలిసి నటించిన చిత్రం కూడా ఈ వేసవిలోనే విడుదల కానుంది. వీటితో పాటు తమిళంలో మరో రెండు మూడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు త్రిష. వయసు పెరిగే కొద్దీ అనేక మంది హీరోయిన్లు అవకాశాలను కోల్పోతుంటే త్రిషకు మాత్రం వరుసబెట్టి సినిమా అవకాశాలు వస్తుండటం గమనార్హం.

